క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గుత్తి రూరల్: కొత్తపేటలో గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. గ్రామంలోని ఆర్డీటీ పాఠశాలలో జరిగిన పోటీల్లో గుత్తి, పెద్దవడుగూరు మండలాలకు చెందిన 67 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రిజనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఆర్డీటీ గుత్తి ఏటీఎల్ నారాయణ తెలిపారు.

వివాహానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం


షెక్షావలికి నగదు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో నివాసముండే వైఎస్సార్‌సీపీ నేత షెక్షావలి సోదరి వివాహం కోసం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గురువారం రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గుంతకల్లులోని తన స్వగృహం వద్ద ఎమ్మెల్యే నగదు అందించారు. ఈ సందర్భంగా షెక్షావలి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పప్పుశనగ రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

పుట్లూరు: పప్పుశనగ పండించిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ కాత్యాయని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్వింటాల్ రూ. 5,335 ప్రకారం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. మండలవ్యాప్తంగా 14,455 ఎకరాల్లో 3,694 మంది రైతులు పప్పుశనగ సాగు చేసినట్లు ఆమె వివరించారు.

ఆధార్ సేవలు ప్రారంభం


మాట్లాడుతున్న శ్రీరామిరెడ్డి

శింగనమల: గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి సూచించారు. స్థానిక సచివాలయంలో గురువారం ఆధార్ సేవలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, డిజిటల్ అసిస్టెంట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘానికి విరాళం

తాడిపత్రి టౌన్ : స్థానిక టీచర్ కాలనీలోని పెన్షనర్స్ భవనంలో గురువారం పట్టణానికి చెందిన పెన్షనర్ పంతులయ్య కుమారుడు సుధాకర్‌రాజు రూ.10 వేలను పెన్షనర్స్ అసోసియేషన్‌కు విరాళం అందించినట్లు సంఘం అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి వీరారెడ్డి, కోశాధికారి వెంకటరామయ్య సభ్యులు పెద్దయ్య, అశ్వత్థరెడ్డి, కుళ్లాయిరెడ్డి, సత్య ప్రసాద్‌రెడ్డి, రంగయ్య, పుల్లారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

బుక్కరాయసముద్రం: స్థానిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డాక్టర్ స్వాతి లక్ష్మి, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా అమీనమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మిక గురువు సిరాజుద్దీన్ గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు. తర్వాత వారికి సామూహిక సీమంతం నిర్వహించారు. సీహెచ్ఓ మోహన్‌రావు, వైద్య సిబ్బంది, అమీనమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి అర్బన్: స్థానిక శ్రీనివాసపురానికి చెందిన హేమంత్ అనే యువకుడు పెన్నానది నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో సెబ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి ట్రాక్టర్‌ను పట్టణ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు అందిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి టౌన్: ఫయాజ్ సేవా ట్రస్టు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ ఫయాజ్‌బాషా టీబీ రోగులను కోరారు. స్థానిక సీబీరోడ్డులోని అబ్దుల్ కలాం ఆజాద్ మున్సిపల్ ఫంక్షన్ హాలులో గురువారం ఫయాజ్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 50 మంది టీబీ రోగులకు వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఫయాజ్‌బాషా నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, ఉపాధ్యక్షుడు మహబూబాషా, కోశాధికారి దూదేకుల బాబయ్య, మాజీ కౌన్సిలర్లు బాబు, వరదలయ్య, టీవీ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు హజివలి, గురు ప్రసాద్‌రెడ్డి, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, బషీర్, ప్రసాద్,రియాజ్, అస్లాం, షమీర్ ఫోరా, టీబీ సూపర్‌వైజర్లు సునీల్, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షేమ క్యాలెండర్ ఘనత జగనన్నదే

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



గుంతకల్లులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వెంకటాంపల్లిలో సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గుంతకల్లుటౌన్: ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి సంక్షేమ క్యాలెండర్ ప్రకారం ప్రతి నెలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 7వ వార్డులో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ గడిచిన మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్ల పని తీరును ఆరాతీశారు. వార్డులో రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా వాటిని వీలైనంత సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవస్థితిగతులను మెరుగుపరిచాయన్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని చెప్పారు. అహర్నిశలూ ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్నకు అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, 7వ వార్డు కౌన్సిలర్ కురుబ లింగన్న, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌వీ ఆర్.మోహన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.రామలింగప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప, వార్డు సచివాలయాల పట్టణ కన్వీనర్ జింకల రామాంజినేయులు, 7వ వార్డు నాయకులు సాంబా, జీపీ.రామలింగారెడ్డి, కౌన్సిలర్లు వై.సుధాకర్, భాస్కర్, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, వార్డు ఇన్‌చార్జ్‌లు పీఎస్.మస్తాన్, సుంకప్ప, నాయుడు, హరినాథ్‌రెడ్డి, పార్టీ గృహసారథులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

యల్లనూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. గురువారం వెంకటాంపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్యతో కలిసి గ్రామంలో ఆలూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భోగాతి విజయ ప్రతాప్‌రెడ్డి, సర్పంచులు రామాంజులరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, శంకర్ రెడ్డి, కులశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ వీఎన్‌కే చైతన్య, తాడిపత్రి గ్రామీణ సీఐ చిన్నపెద్దయ్య ఎస్‌ఐలు రామకృష్ణ, వెంకటప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

యల్లనూరు: కల్లూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు భోగాతి విజయప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

యాడికి: మద్యం మత్తులో గురువారం సాయంత్రం ఇంటి ముందున్న నీళ్ల తొట్టెను పగలగొట్టొద్దని చెప్పినందుకు, తనతోపాటు తన భర్తను పారతో దాడి చేసి గాయపరచాడని మండల కేంద్రంలోని కోటవీధికి చెందిన ఓ మహిళ అదే కాలనీకి చెందిన వనరాజుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినది. వనరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

గ్రామ సచివాలయాల తనిఖీ

పుట్లూరు: మండలంలోని మడుగుపల్లి, ఎల్లుట్ల, మడ్డిపల్లి, కుమ్మనమల గ్రామ సచివాలయాలను గురువారం ఎంపీడీఓ యోగానందరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేసి చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు.

జగనన్న ఇళ్ల పరిశీలన

యల్లనూరు: మండలంలోని నిట్టూరు, పెద్దమల్లేపల్లి తదితర గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న జగనన్న ఇళ్లను గురువారం హౌసింగ్ ఈఈ సత్యనారాయణ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ ఏఈ సుప్రజ పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

- ఎన్నికల బాధ్యత గృహసారథులదే
- ఆలూరు సాంబశివారెడ్డి, పైలా నర్సింహయ్య


స్టిక్కర్లను విడుదల చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, పైలా నర్సింహయ్య

యల్లనూరు: పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే 2024లో మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సచివాలయ మండల కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదం'తో ముందుకు సాగాలన్నారు. 2019 ఎన్నికల్లో పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కి మాత్రమే దక్కిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నాయన్నారు. దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా పాలన అందిస్తున్నారన్నారు. గతంలో చీనీచెట్ల నరికివేత, ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న మండలం ఇప్పుడు జగనన్న పాలనలో ప్రశాంతంగా ఉందని తెలియజేశారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల విధులు విధానాలపై ప్రభుత్వం రూపొందించిన వీడియో ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈనెల 20, 21, 22, 23వ తేదీల్లో ఇంటింటికీ వలంటీర్లు, గృహసారథులు వెళ్లి ప్రభుత్వం పంపిణీ చేసిన మా నమ్మకం నువ్వే జగన్ అనే సామగ్రిని పంపిణీ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొద్దామన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపిద్దాం

వైఎస్సార్‌సీపీ తరఫున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భోగాతి విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి, ఎంపీటీసీ సభ్యుడు తిమోతి, జేసీయస్ మండల ఇన్‌చార్జ్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు రామాంజులరెడ్డి, అశోక్‌కుమార్ రెడ్డి, ఓబులమ్మ, యల్లనూరు సచివాలయ కన్వీనర్లు కిరణ్, జాఫర్, చాంద్‌భాష, వైఎస్సార్‌సీపీ నాయకులు గొడ్డుమర్రి ఈశ్వరరెడ్డి, కల్లూరు ప్రతాప్‌రెడ్డి, గడ్డంవారిపల్లి రామాంజులరెడ్డి, యల్లనూరు ఉమామహేశ్వరరెడ్డి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు గృహసారథులకు శిక్షణ

పుట్లూరు: నాయకునిపల్లి బాట సుంకులమ్మ సమీపంలో శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ అందించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు తెలిపారు. సమావేశానికి ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ఇంటర్న్‌షిప్ ప్రయోజనకరం

గుంతకల్లు రూరల్: ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని డిల్లీ బజాజ్ ఫిన్ సంస్థ కార్పొరేట్ ట్రైనర్ అభిషేక్ రాజ్ పేర్కొన్నారు. స్థానిక శంకరానందగిరీ డిగ్రీ కళాశాలలో బజాజ్ ఫిన్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో 6 నెలలపాటు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ ముగిసిన నేపథ్యంలో గురువారం కళాశాలలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 86 మంది తృతీయ సంవత్సరం విద్యార్థులు హ్యూమన్ రిసోర్స్ మాడ్యూల్స్ అనే అంశంపై ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినట్లు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పెద్దవడుగూరు : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాలు, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం సుధాకర్‌బాబు, సీహెచ్ఓ చిట్టితల్లి, పీహెచ్ఎన్ హేమలత, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఏఎన్ఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయండి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా

తాడిపత్రి టౌన్ : పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మార్చి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతకు తగ్గట్టుగా విద్యార్థులను చదివించాలన్నారు. వెనుక బడిని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సుధాకర్, రాధాకృష్ణ, ప్రసాద్ సీనియర్ అసిస్టెంట్ అనిల్ పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు


ఎద్దుల యజమానులను సన్మానిస్తున్న వీఆర్ఓ

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. గురువారం పాల పళ్ల విభాగం వృషభాల పోటీలు ముగిసాయి. అనంతరం 6 పళ్ల కేటగిరి విభాగం దూలం పోటీలను మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్ ప్రారంభించారు. పోటీలు సీనియర్ వృషభాల పోటీలతో ముగుస్తాయని నిర్వాహకులు ప్రవీణ్, పురుషోత్తం యాదవ్ తెలిపారు. ఎద్దుల పోటీలలో పాల్గొన్న యజమానులకు వీఆర్ఓ నాగరాజు శాలువా, పూలమాలతో సన్మానించారు. పోటీలు ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కుళ్లాయిస్వామి సన్నిధిలో నాటక అకాడమీ చైర్‌పర్సన్


స్వామిని దర్శించుకుంటున్న చామలూరు హరిత దంపతులు

నార్పల: మతసామరస్యాలకు ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామిని రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ చామలూరు హరిత, చామలూరు రాజగోపాల్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి కావాలని స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

ఆసియా వేదిక కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా వారితో డాక్టరేట్ పొందిన హార్మోనిస్ట్, కళాకారుడు బండారు నాగేషను గురువారం రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ చామలూరు హరిత మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె నాగేష్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, చెన్నంపల్లి శ్రీరాములు, లక్ష్మీనారాయణ, ప్రభుదాసు, నారాయణస్వామి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట

పామిడి: పట్టణంలోని భోగేశ్వర, లక్ష్మీ చెన్నకేశవ ఆలయాల ఆవరణలోని నాగుల కట్టపై గురువారం అప్పన్నగారి వంశస్తుల ఆధ్వర్యంలో నాగ విగ్రహాల ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ చెన్నకేశవ ఆలయ అర్చకులు పురుషోత్తమ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కలశస్థాపన, గణపతిపూజ, నవగ్రహపూజ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, కవి కే నారాయణమూర్తి, కుమార్, నాగేంద్ర, ఓబులేసు, చిరంజీవి పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు: అశ్వత్థం తిరునాల్లో భక్తులు సమర్పించిన కానులను గురువారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. నారాయణ స్వామి, భీమలింగేశ్వర స్వామి ఆలయాల్లోని శాశ్వత హుండీల ద్వారా రూ.4 లక్షలు వచ్చినట్లు పర్యవేక్షణ అధికారిణి శోభారాణి, ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.

సదరం క్యాంప్ వాయిదా

శింగనమల: స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం తలపెట్టిన సదరం క్యాంప్‌ను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్. రమణనాయక్ తెలిపారు. ఈనెల17న సదరం క్యాంప్ నిర్వహిస్తామన్నారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ

గార్లదిన్నె: హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కార్యక్రమాల పర్యవేక్షణ అధికారి డాక్టర్ చెన్నకేశవులు పేర్కొన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా 9వ తేదీన హైరిస్క్ గర్భిణులకు వైద్య సేవలు అందించాలన్నారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న నబీరసూల్

పామిడి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కో–ఆర్డినేటర్ కంబదూర్ షేక్ నబీరసూల్ కోరారు. గురువారం స్థానిక ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్నికల నిఘా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో విజ్ఞతతో ఓటు వేయాలన్నారు. కుల, మత, ప్రాంతీయ తత్వాలు, మద్యం, డబ్బు వంటి ప్రలోభాలకు తావ్వికుండా ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నప్పుడే ఓటుకు సార్థకత ఉంటుందన్నారు. సమాచారహక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు హొన్నూరప్ప, జేవీవీ కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్, హైకోర్టు అడ్వకేట్ కోరి చంద్రశేఖర్, వినియోగదారుల సంఘం సభ్యులు కల్లూరు గురూజీ, జేవీవీ మండల కార్యదర్శి ఓబిరెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీంద్ర

గుంతకల్లు రూరల్: ఎన్నికల కమిషన్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో గురువారం తహసీల్దార్ రాము, ఎంపీడీఓ జాషువా, కసాపురం ఎస్ఐ గోపాలుడు తదితరులు తమ సిబ్బందితో స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌ను పరిశీలించారు. మండలానికి 6 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో సదుపాయాలపై దృష్టి సారించారు.

పెద్దవడుగూరు : ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కావడంతో గురువారం పెద్దవడుగూరులోని జెడ్పీ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుకు ఆర్డీఓ రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో కల్పించే సౌకర్యాలపై తహసీల్దార్ ఈరమ్మ, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, హెచ్ఎం సుధాకర్ బాబు, ఈఓపీఆర్డీ నాగేశ్వరశాస్త్రి పాల్గొన్నారు.

సైబర్ నేరాల దర్యాప్తుపై అవగాహన


మాట్లాడుతున్న రామాంజనేయులు

తాడిపత్రి అర్బన్: సైబర్ నేరస్తులను గుర్తించడంలో పోలీసులు చురుకుగా వ్యవహరించాల్సి ఉంటుందని డీఎస్పీ వీఎన్‌కె చైతన్య, తెలుగు సైబర్ ఆర్మీ సైబర్ నేరాల దర్యాప్తు నిపుణులు రామాంజనేయులు సూచించారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వారు సైబర్ నేరాల దర్యాప్తుపై సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా టోల్ నంబర్ 1930 ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని సూచించారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి చేద్దాం


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

గుంతకల్లుటౌన్: వెట్టిచాకిరీ పనిలో చిక్కుకున్న వారిని రక్షించి వ్యవస్థ నిర్మూలనకు కృషి చేద్దామని డీఎస్పీ నరసింగప్ప పిలుపునిచ్చారు. గురువారం పొట్టిశ్రీరాములు సర్కిల్ వద్ద వెట్టిచాకిరీ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించి అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ బి.రాము మాట్లాడుతూ వెట్టిచాకిరీ నిర్మూలన కోసం అన్ని విధాలా కృషి చేయాలన్నారు. అలాంటి వ్యవస్థలో మగ్గిపోతున్న కార్మికులకు ప్రభుత్వం ద్వారా పునరావాసం కల్పించేందుకు పాటుపడాలన్నారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు రామసుబ్బయ్య, గణేష్ పాల్గొన్నారు.

ఈ-కేవైసీ త్వరగా పూర్తి చేయండి

యాడికి: ఆర్బీకే సిబ్బంది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ – కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని ఏడీఏ నారాయణనాయక్ ఆదేశించారు. కోనుప్పలపాడు రహదారిలో జరుగుతున్న ఈ-కేవైసీని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2,148 మంది రైతులు 8 వేల ఎకరాల్లో సాగు చేశారన్నారు. ఇప్పటి వరకు 1,421 మంది రైతులు ఈ–కేవైసీ చేశారనీ మిగిలిన వారికి ఈ నెల 12లోగా పూర్తి చేయాలన్నారు. ఈకేవైసీ చేయించుకున్న రైతుల నుంచి మాత్రమే ప్రభుత్వం పప్పుశనగ కొంటుందన్నారు. ఏఓ మహబూబ్‌బాషా, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ జయంత్యుత్సవాల పోస్టర్లు విడుదల


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు సేవాఘడ్‌లో జరగనున్న బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తన క్యాంప్ కార్యాలయంలో సంత్ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జయంత్యుత్సవాల పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వెంకటరమణ నాయక్, బంజారా సేవా సంఘం సభ్యులు రాజేష్‌నాయక్, గోపాల్‌నాయక్, రాజు నాయక్, భానునాయక్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు తీవ్ర గాయాలు


గాయపడిన రమాదేవి

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని చంద్ర ప్రియనగర్‌లో మల్లికార్జున కుమార్తె రమాదేవి అనే బాలిక గురువారం ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి కింద పడి తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళితే రమాదేవి ఇంటి మిద్దెపై దుస్తులు ఆరేసి కిందకు దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి మిద్దెపై నుంచి కింద పడింది. ప్రమాదంలో రమాదేవి తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.